క్లుప్తంగా

సీసలిలో అన్నసమారాధన



స్వామివారికి సమర్పించిన నైవేద్యం

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో కొలువై ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమద్ జయంతి వేడుకలు గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజైన శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి 32రకాల పిండివంటలు, స్వీట్స్ తో మహానివేదన సమర్పించి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. జుత్తుగ నాగరాజు,గోకరాజు వెంకటశివ రామరాజు,ఆరేటి వెంకటరత్నప్రసాద్, చెన్నమళ్ళ చంద్రశేఖర్, కట్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గొల్లవానితిప్పలో..

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్పలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ జయంతి సందర్భంగా శనివారం ఘనంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా శ్రీ ఆంజనేయస్వామి వారికి పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. వివిధ వంటకాలతో సుమారు 3 వేల మందికి ఘనంగా అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

నియంత్రణ లేని ఆటోలు



మొగల్తూరు రోడ్డులో ఇష్టానుసారం నిలిపి ఉంచిన ఆటోలు

నరసాపురం: పట్టణంలో ఆటోల సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. ఆటోలను ఇష్టానుసారం రోడ్లమీదే నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మితిమీరిన వేగంతో ఆటోలను తిప్పడం, కనీస వయస్సులేని చిన్నచిన్న పిల్లలు సైతం ఆటో డ్రైవర్ల అవతారం ఎత్తడంతో ప్రతి రోజూ ఆటోల కారణంగా ఏవో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. పట్టణంలో దాదాపు 400 పైగా ఆటోలున్నాయి. అయితే ఆటోలను నిలిపి ఉంచడానికి ప్రత్యేకంగా ఎక్కడా స్టాండ్స్ లేక పోవడం ఇబ్బందులను తెచ్చి పెడుతుంది. ఆటో డ్రైవర్ల ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపి ఉంచడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండ్, గుర్రపుబళ్ల స్టాండ్, ఎండుచేపల మార్కెట్ ప్రాంతాల్లో ఆటోల సమస్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఆటోలను రోడ్ల మీదే నిలిపి ఉంచుతున్నారు. రద్దీగా ఉండే బస్టాండ్, గుర్రపు బళ్ల స్టాండ్ వద్ద ఆటోలు కారణంగా ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. ఇటీవల కొత్తగా గడ్డిబజార్ సెంటర్, కనకదుర్గ ఆలయం వద్ద కూడా ఇష్టానుసారం ఆటోలు నిలుపుతుండడంతో స్థానికులు, అటుగా వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్‌శాఖ దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ప్రేమ్‌చంద్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఉన్నమట్ల ప్రేమ్‌చంద్

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన లవ్ పీపుల్ ఫౌండేషన్ సేవా సంస్థ చైర్మన్, రచయిత, దళిత అభ్యుదయ వాది ఉన్నమట్ల ప్రేమ్‌చంద్‌కు కేరళ రాష్ట్రానికి చెందిన కంకారిడియా యూనివర్సిటి డాక్టరేట్ ప్రధానం చేసింది. యూనివర్సిటి బిషప్ రాబిన్‌సన్ డేవిడ్ చేతుల మీదుగా శనివారం ప్రేమ్‌చంద్ డాక్టరేట్ అందుకున్నారు. ప్రేమ్ కుమార్ లవ్ పీపుల్ ఫౌండేషన్ సేవా సంస్థను స్థాపించి గత 14 సంవత్సరాలుగా నిర్విరామంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డు ప్రధానం చేశారు. ప్రేమ్‌కుమార్‌కు డాక్టరేట్ రావడం పట్ల పలువురు సామాజిక సేవా కార్యకర్తలు, బహుజన రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

రేపు మిస్ నరసాపురం పోటీలు

నరసాపురం: ఆర్‌వీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తెలగ కల్యాణమడపంలో మిస్ నరసాపురం, మిసెస్ నరసాపురం పోటీలు నిర్వహిస్తోన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు మిస్ నరసాపురం పోటీల్లో, 26 నుంచి 56 వయస్సు కలిగిన మహిళలు మిసెస్ నరసాపురం పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సంప్రదాయ చేనేత చీరలు ధరించి మాత్రమే పోటీల్లో పాల్గొనాలని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 75699 87919 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

- వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



పాలకోడేరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



చెస్ ఆటలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు



క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

పాలకోడేరు: ప్రస్తుత స్మార్ట్‌ఫోన్ యుగంలో విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో ఉండే గ్రంథాలయే వైపే చూడడం లేదు. గతంలో ఉదయం సాయంత్రం విధిగా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేసేవారు. రాను రాను ఈ పరిస్థితి లో మార్పు వచ్చింది. పుస్తక పఠనంపై పెద్దలతోపాటు చిన్నారుల్లో సైతం ఆసక్తి తగ్గుతోంది. దీని వల్ల గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య తగ్గుతు వస్తుంది. వేసవిలో ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా పుస్తక పఠనం పై ఆసక్తి పెంచేందుకు ప్రస్తుతం వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 28న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 6 వరకు నిర్వహించనున్నారు. ఆటలు, పాటలతో పాటు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించే విధంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుచారు.

నేర్పే అంశాలు ఇవే..

ఈ తరగతుల్లో చిన్నారులకు తెలుగు పద్యాలు చదవడం, చందమామ కథలు శతక పద్యాలు చిత్రలేఖనం గణిత సూత్రాలు స్పోకెన్ ఇంగ్లీష్ ఇంగ్లీష్ గ్రామర్ తరగతులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా చిన్నారులకు యోగా, ధ్యానం, క్యారామ్స్ చెస్ తదితర అంశాల్లో మెలకువలు నేర్పిస్తున్నారు. అలాగే వారాంతపు పరీక్షలు నిర్వహించి వాటిలో ప్రతిభ కనబరచిన వారికి పుస్తకాలు పెన్నులు బహుమతులుగా అందజేసి ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంటర్నెట్ ప్రభావం అధికంగా ఉండడంతో చిన్నారులు ఆన్‌లైన్ బారిన పడుతున్నారు. ఈ తరుణంలో పుస్తక పఠనం తో వారికి విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశం తో ఏర్పాటు చేసిన ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు చిన్నారులతో కళకళలాడుతున్నాయి.

తల్లి దండ్రుల ప్రోత్సాహం

ఉండి, భీమవరం నియోజకవర్గంలో ఉన్న 32 గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను పిల్లల తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 4 గంటల పాటు ఆయా గ్రంథాలయాల్లో సుమారు 30 నుంచి 40 మంది విద్యార్థులు పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. చదువుతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించే యోగా శిక్షణ కూడా ఇస్తున్నారు. చిత్రలేఖనం పేపర్‌తో క్రాఫ్ట్ బొమ్మల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆసక్తి చూపుతున్నారు



వేసవి శిక్షణ తరగతులపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు చదువుతో పాటు ఇతర అంశాల్లో ఇస్తున్న శిక్షణ ఇస్తుండడంతో వారితో సృజనాత్మకత పోటీతత్వం పెరుగుతుంది. గణిత సూత్రాల్లో మెలకువలు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్ల పోటీ పరీక్షల్లో సులభంగా విజయం సాధించవచ్చు. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

– జి.బాలరాజు, గ్రంథాలయాధికారి గొల్లలకోదేరు

శిక్షణ బాగుంది



వేసవి తరగతుల్లో చదువుతో పాటు యోగా,బొమ్మల తయారీ చిత్రలేఖనం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. మాతో పాటు స్నేహితులను కూడా తరగతులకు తీసుకువెళ్తున్నాం. వేసవి సెలవుల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రంథాలయంలోనే ఉంటున్నారు. యోగా లోని పలు ఆసనాలను, చెస్ క్యారమ్స్ ఆటలు లను ఇక్కడ నేర్పిస్తున్నారు.

– హనీషా, సిరి, 7వ తరగతి

అవిశ్వాస తీర్మానంపై సమావేశం

కాళ్ల: మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ అవిశ్వాస తీర్మానంపై శనివారం భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఉప సర్పంచ్ పై అవిశ్వాస తీర్మానం కోరుతూ పలువురు వార్డు మెంబర్లు ఇచ్చిన ఫారం-04 పై నిర్వహించిన సమావేశంలో 10 మంది వార్డు సభ్యులకు 7 గురు సభ్యులు ఉప సర్పంచ్ శ్రీనివాస్‌కి వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో ఆయన ఉపసర్పంచ్ తన పదవిని కోల్పోయినట్లు అధికారులు స్పష్టం చేశారు.

సాగునీటి వినియోగదారుల సంఘం సమావేశం

వీరవాసరం: స్థానిక సంత మార్కెట్ రైతు సేవా కేంద్రంలో శనివారం మత్స్యపురి సాగునీటి వినియోగదారుల సంఘం సమావేశం, వీరవాసరం సాగునీటి వినియోగదారుల సంఘం సమావేశాలు శనివారం నిర్వహించారు. ఈ సమావేశాల్లో సభ్యులు కాలువల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం సమావేశంలో ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన శాంక్షన్ వర్క్స్ లిస్టును ఇరిగేషన్ జేఈ బసవ సత్యనారాయణ సంఘం సభ్యులకు తెలియజేశారు. అలాగే డ్రైయినేజ్ శాఖ జేఈ వేంద్ర రమణ ఆ శాఖకు సంబంధించిన పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో మత్స్యపురి నీటి సంఘం డీసీ అధ్యక్షుడు ఆకుల లీలా కృష్ణమూర్తి, వీరవాసరం నీటి సంఘం అధ్యక్షుడు గొరెడ్డి చిన్నారావు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో మందపాటి రామారావు, సావిత్రమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శనివారం పేదలకు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఏటా పేదలకు ఇదే విధంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో మందపాటి కృష్ణమూర్తి, మందపాటి విశ్వేశ్వరరావు, మందపాటి వెంకన్న పాల్గొన్నారు.

‘పదవి పోయినా వైఎస్సార్ సీపీ కార్యకర్తగానే ఉంటా’



ఎల్ఎన్ పురం గ్రామ ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్న శ్రీనివాస్

కాళ్ల: పదవి పోయినా పర్వాలేదు కానీ వైఎస్సార్ సీపీ కార్యకర్తగానే ఉంటానని కాళ్ళ మండలం ఎల్ఎన్ పురం గ్రామ ఉపసర్పంచ్ మైలా శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎల్ఎన్ పురం గ్రామ ఉప సర్పంచ్‌గా ఉన్న శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో స్వాతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పంచాయతీ ఎన్నికల్లో గ్రామంలో వైఎస్సార్‌సీపీ తరపున వార్డు సభ్యునిగా గెలిచి ఉపసర్పంచ్‌గా తనను ఎన్నుకున్నారని తెలిపారు.అయితే అధికారం మారిన తర్వాత కొందరు తమ ఆస్తులు కాపాడుకోవడానికి స్వార్థ రాజకీయాలతో తెలుగు దేశం కండువా కప్పుకుని తనను కూడా ఇబ్బందిపు గురి చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తనను కూడా తెలుగుదేశం కండువా కప్పుకోవాలని లేకపోతే ఉప సర్పంచ్ పదవి నుంచి తొలగిస్తామని బెదిరించారని ఆరోపించారు. దళితుడిని కావడంతో అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉప సర్పంచ్‌గా గడిచిన నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకున్నానని చెప్పారు. అయితే తన పదవి పోయిన ఎప్పటికీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగానే ఉంటానని స్పష్టం చేశారు. తనపై అవిశ్వాస తీర్మానం పెట్టి రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని చూశారని దీంతో మనస్థాపానికి గురై తన ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నానని తెలియజేశారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేసి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వెంట నడుస్తానని పేర్కొన్నారు.

అతిగా మద్యం సేవిస్తే కటుంబం గుల్లే



భీమవరంలో ర్యాలీ చేస్తున్న ఆటోయూనియన్ నాయకులు

భీమవరం: అతిగా మద్యం సేవించడం కుటంబాన్ని గుల్లచేయడమేగాక జీవితకాలాన్ని తగ్గిస్తుందని భీమవరం ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు అన్నారు. శనివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం పాత బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ సభ్యులతో మద్యం మానండి–ఆరోగ్యంగా ఉండండి అంటూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామరాజు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే మద్యానికి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇటీవల కాలంలో విందులు, వినోదాల పేరుతో యువత అతిగా మద్యం సేవించడం ఎక్కువైందని ఇది ప్రమాదకరపరిస్థితి అన్నారు. అనంతరం మద్యం వల్ల కలిగే అనర్ధాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటోయూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ, పాత బస్టాండ్ ఆటోయూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏసుబాబు, పోతుల పెద్దిరాజు, నర్సింహారావు, యముడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ఉండాలి



బహుమతులు అందిస్తున్న పాస్టర్లు సాల్మన్ రాజు, అభిషేక్ పాల్

వీరవాసరం: ప్రతి ఒక్కరూ చదువుతోపాటు భక్తి భావం పెంపొందించుకోవాలని వీరవల్లి పాలెం దైవ సమాజం చర్చి పాస్టర్ బద్దే సాల్మన్ రాజు అన్నారు. రాయకుదురు శివారు వీరవల్లి పాలెం దైవ సమాజం చర్చిలో శనివారం బైబిల్‌లోని అపొస్తుల కార్యాలు గ్రంథంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. రాయకుదురు, వీరవల్లిపాలెం, తోకలపూడి, చింతల కోటిగరువు, పాలకొల్లు రూరల్ మండలం తిల్లపూడి సంఘాలకు సంబంధించి విద్యార్థులు, పెద్దలు క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం టి.సామ్యేలురాజు , ద్వితీయ స్థానం రత్నకుమారి, తృతీయ స్థానం శాంతి సాధించారు. వీరికి పాస్టర్ సాల్మన్ రాజు, అభిషేక్ పాల్, క్విజ్ నిర్వాహకురాలు దివ్య బహుమతులను అందించారు. అనంతరం గీతాలు ప్రార్థనలు జరిపారు. బైబిల్ గ్రంథంలో పట్టు సాధించేందుకు ప్రతినెలా ఈ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల చింతల కోటి గరువు చర్చిలో పాస్టర్ అభిషేక్ పాల్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫెడ్రిక్, జ్యోతి, సుజీవ్ షారోను రాణి, జెమిమా, నారీమణి విరాజిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 5 కోట్ల సాయి నామ పుస్తకాల ఆవిష్కరణ

ఆకివీడు: స్థానిక గుంటూరు సెంటర్లోని సాయి ఆలయం వద్ద నిర్మించిన 100 అడుగుల సాయి ఈశ్వర్ స్థూపంలో ఆదివారం కోటి సాయి నామములతో లెక్కించిన పుస్తకాలను నిక్షిప్తం చేయనున్నారు. సాయి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రధాన సెంటర్లో ఉండా సాయి గ్రామోత్సవం నిర్వహించారు. సాయి దీక్షాపరులు గురువులు అధిక సంఖ్యలో గ్రామోత్సవాల్లో పాల్గొన్నారు. రాత్రి సాయిబాబా విగ్రహానికి భారీ పులాభిషేకం చేశారు.

బహుజన నేత చింతపల్లికి అభినందనలు

పెనుగొండ: దళిత , బహుజన సమస్యలపై అనేక పోరాటాలు చే సి మన్ననలు పొందిన చింతపల్లి గురుప్రసాద్ డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమని ఆచంట నియోజకవర్గ మాల సంఘాల జేఏసీ చైర్మన్ సుంకర సీతారామ్ అన్నారు. శనివారం డాక్టర్ చింతపల్లి గురుప్రసాద్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కన్వీనరు మట్టారాము, జేఏసీ నాయకులు కోట వెంకటేశ్వరరావు, జెంట్రీ శ్రీను, ఉన్నమట్లమునిబబాబు, పోతుమూడి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

లలిత కళలతోనే సామాజిక చైతన్యం



భీమవరంలో సంస్కార భారతి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించుకోవాలని లలిత కళలతోనే సామాజిక చైతన్యం సాధ్యమని సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు చేగొండి సత్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం భీమవరం ఛాంబర్ అఫ్ కామర్స్ భవనంలో కళా సంస్థలు, సంగీత, సాహిత్య, కవిత, ఆధ్యాత్మిక రంగాల ఆధ్వర్యంలో సంస్కార భారతి జిల్లాశాఖను ప్రారంభించి సంస్కార భారతి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1981లో ఆగ్రా కేంద్రంగా ప్రారంభమైన సంస్కార భారతి దేశవ్యాప్తంగా వందలాది శాఖలతో విస్తరించిందన్నారు. గన్నాబత్తుల శ్రీనివాస్, చెరుకువాడ రంగసాయి, ఆరేటి ప్రకాష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు భావితరాలకు కళల ద్వారా తెలియజెప్పడానికి సంస్కార భారతి కృషి చేస్తుందన్నారు. భీమవరం పట్టణంలో పాఠశాలలు, కళాశాలల్లో సంస్కార భారతి యూనిట్లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాంజీ, యర్రంశెట్టి వెంకటరత్నం, టీవీవీ ప్రసాద్, జవ్వాది శ్రీనివాస్, తెన్నేటి లక్ష్మీ నారాయణమూర్తి, కలిగొట్ల గోపాలశర్మ, పిప్పళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ నినాదాలు చేస్తున్న కాలనీ వాసులు

పెనుగొండ: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన కు చొరవ చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం సిద్ధాంతం ఘటాల దిబ్బలోని జగనన్న కాలనీలో సమస్యలను పరిశీలించారు. ఈ ప్రాంతం వర్షం వస్తే చాలు మునిగిపోతుందన్నారు. అలాగే గుంతల్లో నీటి నిల్వలు పెరిగి విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. అధికారులు సత్వరం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ



వేములదీవి వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వరస్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన వాసవిక్లబ్ కోశాధికారి, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు కోట్ల బాలకృష్ణ, అరుణ కుమారి దంపతుల ఆర్థిక సహకారంతో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

చినుకుపడితే చిత్తడే

- అధ్వానంగా ఉండి బస్టాండ్ రోడ్డు
- బస్టాండ్ లోపలికి వెళ్లేందుకు ప్రయాణికుల పాట్లు



ఛిద్రంగా మారిన ఉండి బస్టాండ్‌లోని రోడ్డు

ఉండి: పేరు గొప్ప ఊరుదిబ్బ అన్నట్టుంది ఉండి పరిస్థితి. పేరుకే నియోజకవర్గ కేంద్రం కానీ అన్నింటా వెనుకబాటు అనే చందాన తయారైందని ప్రజలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఉండి బస్టాండ్ సమస్య ఏళ్ల తరబడి పరిష్కరించుకుండా వదిలేస్తున్నారని వాపోతున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి ఉన్నత పదవిలో ఉండి కూడా బస్టాండ్‌లో రోడ్లు అత్యంత దారుణంగా ఉండడం ఏంటి? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడిచి బస్టాండ్‌కు వెళ్ళేందుకు ప్రయాణికులు చుక్కలు చూస్తున్నారు. బస్టాండ్ నిర్మించిన కొత్తలో ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. చుట్టూ పచ్చని చెట్లతో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలతో ప్రయాణికులు కిటకిటలాడేవారు. కానీ ఇప్పుడు బస్టాండ్‌కు రావాలంటే ప్రయాణికులు భయపడిపోతున్నారు. ప్రయాణికులు బస్టాండ్‌లోనికి రావాలన్నా,బస్సు దిగి బయటకు వెళ్లాలన్నా రోడ్ల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. అంతే కాకుండా బస్టాండ్‌లో విద్యుత్ లేకపోవడంతో సాయంత్రం నుంచి రాత్రి వేళల్లో ప్రయాణికు భయపడిపోతున్నారు.

జంక్షన్‌గా ఉండి బస్టాండ్

ఉండి బస్టాండ్ ఓ జంక్షన్. ఎందుకంటే ఉండి నుంచి విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, అలాగే భీమవరం, రాజమండ్రి, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలమైన రోడ్లు ఉండడంతో రోజూ పదుల సంఖ్యలో బస్సులు బస్టాండ్‌కు వస్తూ ఉంటాయి. దీంతో ప్రయాణికులు రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న బస్టాండ్‌లో కనీస మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించడం లేదు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

తాగునీటికి కటకట

ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు ఉండి బస్టాండ్‌ను పట్టించుకోవడమే మానేశారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచండి,ఆటోలు ఇతర వాహనాలు ఎక్కకండి.. ఆర్టీసీ ప్రయాణం సురక్షితం అని చెప్పే అధికారులు వారి మాటలు నమ్మి బస్టాండ్‌కు వచ్చే వారికి కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ఎవరైనా దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తేనే ప్రయాణికులకు తాగునీరు అందే అవకాశం ఉంది. లేకపోతే వారి బాధలు వారివే. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉండి బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి చేస్తామన్నారుగా..



అధికారంలోకి వస్తే ఉండిని బంగారంగా మార్చేస్తామని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. కానీ క్షేత్రస్థాయికి వచ్చేసరికి కూటమి అధినాయకుడు చంద్రబాబు మాదిరి అన్నీ మోసాలే అన్నట్లు పరిస్థితి తయారైంది. వివిధ నియోజకవర్గాల ప్రజలు ఉండి బస్టాండ్ నుంచి ప్రయాణిస్తారు కదా వారికి తెలీదా? ఉండి అభివృద్ధి.

– శేషాద్రి శ్రీనివాస్, ఉండి

ప్రయాణికులకు సదుపాయాలు కల్పించాలి



ఆర్టీసీ ప్రభుత్వ సంస్థ కాబట్టి ప్రయాణికులకు కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన భాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై, ప్రజాప్రతినిధులపై ఉంది. కాబట్టి రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు బస్టాండ్‌ను సందర్శించి సమస్యలను పరిష్కరించాలి.

– అంగర రాంబాబు, ఉండి.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో శనివారం పిల్లలకు నీతి కథలు చెప్పారు. అలాగే పిల్లలకు అనుభవజ్ఞులైన తెలుగు అధ్యాపకులు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి ఆటలు నేర్పించారు. పట్టణంలోని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డి.సాంబమూర్తి కంటి ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులకు మంచి స్పందన వస్తోందని, ప్రతిరోజూ తరగతులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుందని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.

గోదావరి గట్టుపై రెయిలింగ్ ధ్వంసం

నరసాపురం: పట్టణంలో గోదావరి గట్టు వెంబడి పాలరాయితో నిర్మించిన రెయిలింగ్ ధ్వంసమైయ్యింది. 2015 గోదావరి పుష్కరాల సమయంలో రెయిలింగ్‌ను గట్టు వెంబడి నిర్మించారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో రెయిలింగ్ ధ్వంసమైంది. అలాగే ఆ సమయంలో నిర్మించిన ఫుట్‌పాత్ కూడా ధ్వంసమైయ్యింది. కొంతమేర రెయిలింగ్ చోరీకి కూడా గురవుతోంది. దీంతో అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా ఈ సమస్య దృష్టి పెట్టి పరిష్కరించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.